ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



కాంట్రాక్టు కార్మికుల 12 గంటల దీక్షను ప్రారంభించి మాట్లాడుతున్న జగ్గునాయుడు

నిర్బంధం ద్వారా సమ్మెను అణచలేరు

- సమ్మె ఉధృతి ద్వారా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలి
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాల నేతల పిలుపు
- కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల12 గంటల దీక్ష

వార్త మెయిన్ మూడో పేజీలో..

విమ్స్‌లో కోవిడ్ వార్డు సిద్ధం

అందుబాటులోకి రాపిడ్ కిట్స్, మందులు



విమ్స్‌లో సిద్ధమైన వార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖలో గురువారం కోవిడ్ కేసు నమోదుతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలోనే విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో అధికారులు ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. ఆ వార్డును శుక్రవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పరిశీలించారు. సరికొత్త వేరియంట్ జెఎన్ 1, ఎల్ఎఫ్ 7, ఎన్‌బి 1.8 ఆందోళన కలిగిస్తున్న తరుణంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విమ్స్ ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. నగరంలో ఒక కేసు నమోదు కావడంతో కోవిడ్ వైద్యపరీక్షల నిమిత్తం రాపిడ్ కిట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాపిడ్ కిట్‌లో పాజిటివ్ అని వస్తే వెంటనే ఆర్‌టిపిసిఆర్ పరీక్షలకు పంపించి కోవిడ్ నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కోవిడ్ రోగులకు వైద్యం అందించేందుకు వైద్యులకు, సిబ్బందికి పిపి కిట్లను, రోగులకు అవసరమైన మందులను సమకూర్చుకున్నట్లు వివరించారు. కోవిడ్ కొత్త వేరియంట్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భౌతికదూరం పాటిస్తూ, సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. వృద్ధులు, గర్భిణులు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. అత్యవసరం మినహా సరదాల కోసం బయట తిరగరాదన్నారు. మాస్కుల వినియోగం, నిరంతరం శానిటేషన్ చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 25వ తేదీన నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, విశాఖ పరిధిలోని 19 పరీక్షా కేంద్రాల్లో జామర్లు ఏర్పాటు చేయాలని బెల్ అధికారులకు సూచించారు. పరీక్షకు 8,424 మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, టాయిలెట్ల వంటి కనీస వసతులు కల్పించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జెసి, డిఆర్వో,ఇతర అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయా కేంద్రాల ఇన్‌చార్జి అధికారులు, సంస్థల నిర్వాహకులు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైనట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యగా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 0891-2590100, 0891-2590102 నెంబర్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.



ఎన్‌టిఆర్‌కు నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

విశాఖకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు కోసం కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా టిడిపికి కంచుకోట అని, అందుకే రాష్ట్రంలో అత్యధిక మెజారిటీని ఇక్కడి ప్రజలు ఇచ్చారని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బాబ్జి అధ్యక్షతన పార్టీ జిల్లా మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను ప్రపంచస్థాయిలో సిఎం చంద్రబాబు అభివృద్ధి పరుస్తున్నారన్నారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సింహాచలం పంచగ్రామాల సమస్యపై జిల్లా మహాసభలో తీర్మానం చేశామని, మహానాడులో కూడా దీనిపై తీర్మానిస్తామని అన్నారు. తప్పుచేశారని తేలితే విజయవాడలోనే కాదు, విదేశాల్లో దాక్కున్నా లాక్కుని వస్తామని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, శాసనమండలి విప్ వేపాడ చిరంజీవిరావు, శాసనమండలి మాజీసభ్యులు దువ్వారపు రామారావు, విశాఖ సౌత్ ఇన్‌చార్జ్, ఆరోగ్య శ్రీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, విజయనగరం డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. తొలుత ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు బీచ్ రోడ్డులో యోగా ఈవెంట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యోగా మాహోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్‌కెబీచ్ రోడ్‌లో వేసిన శాశ్వత వేదిక వద్ద జిల్లాస్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. రోజూ యోగాసనాల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో మెగా ఈవెంట్‌ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరెవెరు ఏయే బాధ్యతలు నిర్వర్తించాలో పేర్కొన్నారు. శనివారం జరిగే మెగా యోగా ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు భాగస్వామ్యం కానున్నారని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

రహేజా మైండ్ స్పేస్‌లో విఎంఆర్‌డిఎ రోడ్ షో

ప్రజాశక్తి - ఎంవివి.కాలనీ : సిఎం చంద్రబాబు నిర్దేశిస్తున్న లక్ష్యాలను చేరుకునే క్రమంలో విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసే లక్ష్యంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ రహేజా మైండ్ స్పేస్‌లో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన రోడ్‌షో నిర్వహించారు. మధురవాడలో ఉన్న విఎంఆర్‌డిఎకి చెందిన మధురవాడ హైట్స్ 87.80 ఎకరాల భూమిని ప్రైవేట్ మరియు పబ్లిక్ పద్ధతిలో ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన ఈ రోడ్‌షో కార్యక్రమానికి జిఎంఆర్, రహేజా, ఇతర ముఖ్యమైన రియాల్టీ డెవలపర్లు హాజరయ్యారు. విశాఖపట్నం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు, ఇతర అనుబంధిత విషయాలపై చర్చించి వారంతా తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఈ రోడ్ షోలో పర్యవేక్షక ఇంజినీర్ భవానీ శంకర్, ప్రణాళికాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకులను కాపాడిన జివిఎంసి లైఫ్ గార్డ్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: ఆటవిడుపుగా ఆర్‌కె బీచ్‌లో స్నానానికి దిగి మునిగిపోతున్న యువకులను జివిఎంసి లైఫ్‌గార్డ్స్ కాపాడారని జివిఎంసి ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. హైదరాబాదు నుండి విశాఖపట్నానికి ఎనిమిది మంది యువకులు విహారయాత్రకు వచ్చారని, వారు సముద్ర స్నానానికి దిగగా షబ్బీర్ , అబ్బాస్, విద్రస్, హుస్సేన్ అలల తాకిడికి మునిగిపోతుండగా లైఫ్ గార్డ్స్ కాపాడారని తెలిపారు.

నేడు విశాఖలో సమైక్యతా యాత్ర

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పహల్గాంలో గత నెల 22న పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకొని శిక్షించాలని, ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని వదిలేసి వక్రబుద్ధితో మతోన్మాదాన్ని, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరచడాన్ని ఖండిస్తూ, మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోసం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం నగరంలో సమైక్యతా యాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ఈ యాత్ర ద్వారకా ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన ఉన్న గురజాడ అప్పారావు విగ్రహం నుంచి ఆశీలమెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు జరుగనుంది. ఈ యాత్రలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు, అభ్యుదయవాదులు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

బరితెగింపు

సాగులో లేనివారికి పరిహారం జమ
తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ బేఖాతరు
కూటమి నాయకుల ఒత్తిడికి తలొగ్గిన రెవెన్యూ అధికారులు
కోడూరు భూమిపై ఎపిఐఐసికి సిఫార్సు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఇటీవల అనకాపల్లి మండలం కోడూరు సర్వే నెంబర్ 20లో ప్రభుత్వ భూమి 31.77 ఎకరాలకు పరిహారం చెల్లించిన బినామీ సాగుదారుల కూర్పులో పలువురు పాత్ర, సూత్రధారులున్నారు. ప్రభుత్వ భూమిలో సాగుదారులు లేరని 2016 ఫిబ్రవరిలో తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన భూమికి బరితెగించిమరీ పరిహారం చెల్లించారు. అందులోనూ, ఆక్రమణలకు అవకాశంలేని రెవెన్యూ సంరక్షణలోని భూమికి పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కు రెవెన్యూ అధికారులు సిఫార్సు చేశారు. రెవెన్యూ, టిడిపి, జనసేన, వైసిపి నాయకులు కలిసి ప్రభుత్వానికి రూ.6.30 కోట్లు కన్నంపెట్టారు. సాగుదారులు లేకుండానే ఉన్నట్లు జాబితా తయారుచేసి చెల్లింపులు చేసిన విషయం వెలుగులోకి రావడంతో తేలుకుట్టిన దొంగల్లా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే... కోడూరు సర్వే నెంబర్ 20లో సాగుచేస్తున్న తనను సాగుదారునిగా గుర్తించి భూమికి పరిహారం చెల్లించాలని గొర్లె అప్పలనాయుడు (తండ్రి అప్పలస్వామి) దరఖాస్తు చేసుకోవడంపై అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ సర్వేకు ఆదేశించారు. మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సంయుక్తంగా సర్వే నిర్వహించి సర్వే నెంబర్ 20లోని భూమంతా ఎస్ఎఫ్ఎ, రెవెన్యూ రికార్డుల ప్రకారం రాళ్లమెట్టగా నమోదైవున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. కోడూరులో సర్వే నెంబరు 20లోని 39.38 ఎకరాల్లో పిరక్లెటి ఎడ్యుకేషనల్ సొసైటీకి 25 ఎకరాల బదలాయింపు కోసం 2009 సెప్టెంబరు 30న తహశీల్దార్ ప్రతిపాదనలు పంపారు.

ఇదే భూమిలో కొప్పాకకు చెందిన సుబ్బారెడ్డి వేసిన అక్రమ ఫెన్సింగ్‌ను తొలగించి, 39.38 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించి 2003లో తహశీల్దార్ బోర్డులు పెట్టించారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచనామా జరిపాక ఈ భూమిలో సాగుదారులెవరూ లేరని తేలడంతో సాగుదారునిగా పేర్లు చేర్చలేమని అప్పలనాయుడు దరఖాస్తును తిరస్కరిస్తూ ఆయనకు 2016 ఫిబ్రవరి 29న తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. భూమి సంరక్షణ బాధ్యతను విఆర్‌ఒకు అప్పగించారు. సాగుదారులు లేరని తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన భూమికి ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున ఎపిఐఐసితో పరిహారం ఇప్పించేలా రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించారు. తిలాపాపం, తలాపిడికెడు అన్నట్లు టిడిపి, జనసేన, వైసిపి నాయకులు కొందరు కుమ్మక్కై పరిహారం చెల్లించేలా రెవెన్యూ అధికారులపై ఒత్తిడిచేసి ఎపిఐఐసితో డబ్బులు డిపాజిట్ చేయించారు. ప్రభుత్వ భూమిలో సాగులో లేరని తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన భూములకు పరిహారం చెల్లించేలా చేశారు. పరిహారం చెల్లింపు విషయమై ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నరసింహరావు వద్ద ప్రస్తావించగా... రెవెన్యూ అధికారులు తయారుచేసిన సాగుదారుల జాబితా ప్రకారమే పరిహారం డిపాజిట్ చేశామని తెలిపారు. పరిహారం చెల్లింపులో తమకు సంబంధంలేదని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే సాగుదారుల జాబితా తయారుచేసినట్లు రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు.

జమ చేసిన సొమ్ము రాబట్టాలి



కోడూరులో సర్వే నెంబరు 20లోని ప్రభుత్వ భూమిలో బినామీ సాగుదారులకు చెల్లించిన పరిహారం రాబట్టాలి. గతంలో తహశీల్దార్ ఇచ్చిన ఎండార్స్‌మెంట్‌ను పట్టించుకోకుండా పరిహారం చెల్లించి అక్రమాలకు సహకరించిన రెవెన్యూ అధికారులపైనా, వీరిపై ఒత్తిడి తెచ్చిన టిడిపి, జనసేన, వైసిపి నాయకులపైనా చర్యలు తీసుకోవాలి. కోడూరు భూముల పరిహారంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించాలి.

గంటా శ్రీరామ్, సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్



మైక్ అందజేస్తున్న దండు నాగేశ్వరరావు

మైక్ వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీకి కార్మిక నాయకుడు, ప్రజా కళాకారుడు దండు నాగేశ్వరావు రూ.4 వేలు విలువ కలిగిన హ్యాండ్ మైక్‌ను శుక్రవారం అందజేశారు. ఆ మైక్‌ను పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆస్తిపన్ను పెంపు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ఇంటి కొలతల పేరుతో వచ్చే సిబ్బందిని అడ్డుకోవాలి
సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇంటి కొలతలు తక్కువగా ఉన్నాయన్న పేరుతో భారీగా ఆస్తి పన్ను పెంపు, పెనాల్టీ విధించాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా చేసిన నిర్ణయాన్ని తక్షణం రద్దుచేయాలని జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట శుక్రవారం ఆయన నిరసన తెలిపారు. అనంతరం మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, ఇంటి కొలతలు తక్కువగా ఉన్నాయని చెప్పి, ఇంటింటికి కొలతలు తీసి, 20 శాతం పన్నును అదనంగా పెంచి వసూలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి ఈ విధంగా ఆస్తి పన్ను పెంచడం ద్వారా రూ.460 కోట్లు అదనంగా వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిని బట్టి చూస్తే ఒక్క జివిఎంసిలోనే పేద, మధ్య తరగతి ప్రజలపై రూ.112 కోట్ల భారం అదనంగా పడుతుందని చెప్పారు. మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పెంచిన ఆస్తి పన్నును సమీక్షించి, ఆస్తిపన్ను భారం లేకుండా చూస్తామని గత ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని, పెంచిన 15 శాతం పన్నును రద్దు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేయలేదు సరికదా కొత్తగా 20 శాతం పెంచడానికి ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. ఆస్తిపన్ను పెంపు వ్యవహారంపై ఇంటింటికి కొలతలు తీసేందుకు రీ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారని తెలిపారు. రీ సర్వే కోసం ఇంటికి వచ్చే సిబ్బందిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జివిఎంసికి తలసరి గ్రాంటు, అభివృద్ధి నిధులు రూ.1000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. జివిఎంసి నిధులు రూ.350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని, ఇది అన్యాయం అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలపై పన్నులు పెంచే కూటమి ప్రభుత్వం, విశాఖపట్నంలోని అదానీ పోర్టు ఆస్తి పన్ను రూ.50 కోట్లు రద్దు చేయడం భావ్యం కాదన్నారు. పెద్ద పెద్ద హోటళ్లకు ఆస్తి పన్ను తగ్గిస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. జివిఎంసిలో గాని, ఇతర మున్సిపాలిటీలలో గాని ఆస్తి పన్నును పెంచడం, లేదా తగ్గించడం కౌన్సిల్ ఆమోదంతో చేయాల్సి ఉంటుందని, కానీ కౌన్సిల్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఆస్తి పన్నును పెంచడం సరికాదని పేర్కొన్నారు.

జివిఎంసి స్థలం కబ్జా


జివిఎంసి స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి స్థలాన్ని కబ్జా చేసి గుడి పేరుతో శాశ్వత నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే, జివిఎంసి అధికారులు, కార్పొరేటర్ కట్టుకోమని అనుమతి ఇచ్చారని చెప్పి ఇక్కడ కొంత మంది బరితెగించి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు సమీపంలో సామాజిక అవసరాలకు, గ్రీన్ బెల్ట్ కోసం ఉంచిన జివిఎంసి స్థలంలో కొంతమంది ఆలయం కోసం అంటూ దర్గా నిర్మాణం చేపడుతున్నారు. గతంలో కూడా ఇక్కడ కంటైనర్‌లో గుడి ఏర్పాటుకు సిద్ధపడ్డారు. అప్పట్లో జివిఎంసి టౌన్‌ప్లానింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వచ్చి తొలగించారు. అదే ప్రాంతంలో

గుడి పేరుతో శాశ్వత నిర్మాణం

ముస్లిం మత పెద్దలు జెండా పాతి పెట్టి వారి కార్యక్రమాలకు సిద్ధపడ్డారు. అప్పుడు కూడా జివిఎంసి సిబ్బంది తొలగించారు. కొన్ని నెలలు ఆగి మళ్లీ కొంతమంది జగన్నాథ స్వామి గుడి నిర్మాణం అంటూ శాశ్వత నిర్మాణం చేపట్టేందుకు పునాదులు తీస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది అక్కడకు వెళ్లారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ కెల్ల సునీత కట్టుకోమన్నారు అని సమాధానం చెపుతున్నారు. గతంలో ముస్లిములు ఇక్కడ జెండాలు పాతి పెట్టి ప్రార్థనలు చేసుకుంటే అడ్డుకున్న జివిఎంసి అధికారులు ఇప్పుడు గుడి పేరుతో చేపట్టిన నిర్మాణాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మత విద్వేషాలకు అవకాశముంటుందని భావిస్తున్నారు.

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు

జివిఎంసి స్థలంలో గుడి కట్టుకోమని ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు. ఈ విషయం మా దృష్టికి రాలేదు. జివిఎంసి స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం

బాలరాజు, టిపిఒ

చాకు దాడి నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి -ఆనందపురం : చాకుతో దాడిచేసి పరారైన నిందితులను శుక్రవారం ఆనందపురం పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వాసునాయుడు తెలిపారు. ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ వైఎస్ఆర్ కాలనీ జగనన్న ఇండ్ల స్థలం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం జరిగి ఒక వ్యక్తిని చాకుతో పొడిచి పరారైన నిందితులను 24 గంటల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎల్‌వి.పాలెం వైఎస్ఆర్.కాలనీలో నివాసముంటున్న బోర సూరిబాబుకు ఇంటి లక్ష్మణరావు, ఆయన కుమారులు మణికంఠ (29), కార్తీక్ (17) ఇంటి స్థలం విషయంలో ఘర్షణ పడ్డారు. సూరిబాబును మణికంఠ చాకుతో పొడిచిన తర్వాత ముగ్గురూ పరారయ్యారు. సిపి ఆదేశాల మేరకు సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ శివ, సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి నిందితులు ఏలూరు, నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి గుర్తించారు. నిందితులను 24 గంటల్లో పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సిబ్బందిని సిపి అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వాసునాయుడు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

ప్రజాశక్తి- నక్కపల్లి : 2017లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష పడిందని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామానికి చెందిన పైలా గిరిసాయి, వెంకటరమణ 2017 జూన్ 17వ తేదీన బైక్‌పై ఎలమంచిలి వెళుతుండగా లారీ ఢీకొనడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. గిరి సాయి తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై ప్రమాదంలో గాయపడ్డ గిరిసాయి తండ్రి పైలా కృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో పనిచేసిన ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం లారీ డ్రైవర్ రాలి అప్పారావుకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ. ఆరు వేల జరిమానా ఎలమంచిలి కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారని ఎస్ఐ సన్ని బాబు వెల్లడించారు.

క్రీడలతో ఆరోగ్యం


విజేతలకు ట్రోఫీని అందిస్తున్న సిఐ వాసునాయుడు

ప్రజాశక్తి -ఆనందపురం : క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ఆనందపురం సిఐ చింత వాసునాయుడు పేర్కొన్నారు. మండలంలోని బోని రోడ్డు చందక వారి రైస్ మిల్లు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిశ్చిత బాక్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యాన ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు సిఐ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. ఆనందపురం గ్రామానికి చెందిన గాదిరెడ్డి గోవిందరాజు, ఆయన స్నేహితుడు నాయుడు బాక్స్ క్రికెట్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. వైసిపి నాయకుడు మజ్జి వెంకట్రావు మాట్లాడుతూ, క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందించేందుకు దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఎదగాలన్నారు. నిశ్చిత బాక్స్ క్రికెట్ వ్యవస్థాపకులు గాదిరెడ్డి గోవిందరాజు మాట్లాడుతూ విద్యార్థులు, యువత సెల్ ఫోన్‌కు బానిస కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు క్రికెట్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

టోర్నమెంట్‌లో 35 జట్లు పాల్గొనగా మొదటి విజేతగా నిలిచిన విజయనగరం వైల్డ్ ఫైర్స్ జట్టుకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎల్‌వి.పాలెం జట్టుకు రూ.10వేలుతో పాటు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ గంట్యాడ సంతోష్, స్థానిక నాయకులు కొట్యాడ రెడ్డిబాబు, సత్యమూర్తి, లక్ష్మణమూర్తి, శినగం రామారావు, భయ్యా, కోన చందు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి నేరెళ్లవలస గ్రామానికి చెందిన దండు నాగభూషణం (25) ఈ నెల 23వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం... ఇంటర్ చదివి ఆటో, కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దుంప నాగభూషణం మూడు నెలలుగా మతి స్థిమితం లేకుండా ఉన్నాడు. విశాఖ నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స కూడా పొందుతున్నాడు. ఈ నెల 23వ తేదీ ఉదయం 7.30 గంటలకు టిఫిన్ తెమ్మని తల్లి లక్ష్మికి చెప్పాడు. తల్లి టిఫిన్ తెచ్చేసరికి ఇంటి రేకుల షెడ్ తాటి దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ యు.నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గొలుసు దొంగ అరెస్టు

ప్రజాశక్తి-ఉక్కునగరం : మహిళ మెడలోంచి బంగారం గొలుసును తస్కరించిన దొంగను పోలీసులు అరెస్టుచేశారు. దువ్వాడ పోలీసుస్టేషన్ పరిధి గ్లోరియా ఇంగ్లీషు మీడియం పాఠశాల సమీపంలోని నడుచుకొని వెళ్తున్న మహిళ మెడలోంచి ఈ నెల 21వ తేదీన సాయంత్రం ఐదు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి పుస్తెలతాడు తెంపుకుపోయాడు. బాధిత మహిళ దువ్వాడ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు విచారణ చేపట్టి సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ద్విచక్ర వాహన వివరాలతో శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం సప్ప వీధికి చెందిన రాజేష్‌గా గుర్తించి అరెస్టు చేశారు. నిందితునిపై ఇచ్ఛాపురంలో మూడు కేసులు, దువ్వాడ, గాజువాక పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్క కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాజేష్‌పై ఇచ్ఛాపురంలో ఒక క్రిమినల్ కేసు ఉన్నట్లు పేర్కొన్నారు.

హత్య కేసు ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహారాణి పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 డిసెంబర్ 21న అదృశ్యమైన మహిళ హత్యకు గురైందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగదాంబ ప్రాంతానికి చెందిన పల్లా సునీత (45) భర్తతో విభేదాల కారణంగా పిల్లలను విడిచిపెట్టి ఒంటరిగా ఉంటున్న క్రమంలో 2022 జనవరిలో ఆమె అదృశ్యమైనట్లు కేసు నమోదైందన్నారు. గాలింపు చేపట్టినప్పటికీ తగిన ఆధారాలు లభించకపోవడంతో ఆ కేసును అన్ డిటెక్టబుల్ కేసుగా క్లోజ్ చేశామన్నారు. అయితే, తన తల్లి ఆచూకీ కావాలని మృతురాలి కూతురు ఆబోతు సునీత పది రోజుల క్రితం తనను సంప్రదించగా కేసును రీ ఓపెన్ చేశామన్నారు. ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయగా ఆమె 2021 డిసెంబర్‌లో అలుగు దివాకర్ అనే వ్యక్తిచే హత్య చేయబడినట్టు గుర్తించామన్నారు. హత్యకుగల కారణాలను వివరించారు. మృతురాలు రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేసేదని, ఓ ప్లాట్ నిర్మాణ దశలో బిల్డర్‌తో వచ్చిన ఇబ్బందులను పరిష్కరించడంలో ముద్దాయి దివాకర్ ఆమెకు సహకరించి దగ్గరయ్యాడని తెలిపారు. ఆమె కృతజ్ఞతతో తన ప్లాటులో ఒక రూమును దివాకర్ రియల్ ఎస్టేట్ ఆఫీస్ పెట్టుకోవడానికి అంగీకరించిందని తెలిపారు. అతడిని నమ్మి అతను చెప్పిన కొంతమందికి లక్షల్లో అప్పులు కూడా ఇచ్చిందని సిపి పేర్కొన్నారు. అనంతరం వారిద్దరి మధ్య ఉన్న సంబంధం వివాహేతర బంధంగా మారిందన్నారు. ఈ క్రమంలోనే దివాకర్‌ను వివాహం చేసుకోవాలని కోరగా 2021 డిసెంబర్ 26న బుచ్చిరాజుపాలెంలోని తన ఇంటి వద్ద దివాకర్ హత్య చేశాడని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన తన రియల్ ఎస్టేట్ స్నేహితుడు వరప్రసాద్ సాయంతో ఆమె శరీరాన్ని దుప్పట్లో చుట్టి తన కారులో తూర్పు గోదావరి జిల్లా ఎర్రవరం వద్ద పారుతున్న ఎర్ర కాలువలో అర్ధరాత్రి సమయంలో పడేసారని తెలిపారు. కొంతకాలం తరువాత వారు హైదరాబాద్ నుంచి విశాఖకు రాగా మృతురాలి పిల్లలు వారిని సంప్రదించారన్నారు. వారు రకరకాల మాటలు చెప్తసాగారన్నారు. కేసును రీఓపెన్ చేసి సమగ్ర దర్యాప్తు జరపగా వాస్తవాలు వెలుగుచూశాయన్నారు. కేసును ఛేదించిన అధికారులను సిపి మెచ్చుకున్నారు.

56 మందికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 1, 2 వార్డుల పరిధిలోని సంగివలస, చిట్టివలస ప్రాంతాల్లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్స్, ఐసిటిసి సహకారంతో శుక్ర వారం 56 మందికి హెచ్ఐవి / ఎయిడ్స్ పరీక్షలు చేశారు. ఈ మేరకు ప్రజలకు ఆ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది కిశోర్‌కుమార్, ఎం.జ్యోతి, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మహారాజా' బ్యాంకుకు అవార్డులు

ప్రజాశక్తి- సీతమ్మధార : జాతీయ స్థాయిలో కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులకు సంబంధించిన వ్యాపార విధి విధానాలలో 'భారత్ రత్న సహకారిత సమ్మాన్ 2025' పేరిట గురువారం ముంబైలోని ది లలిత్ హోటల్‌లో జరిగిన సభలో 'బెస్ట్ చైర్ పర్సన్ ఆఫ్ ది ఇయర్', 'బెస్ట్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు- ఆంధ్రప్రదేశ్ స్టేట్' అవార్డులను ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు గెలుపొందింది. ఈ అవార్డులను బ్యాంకు జనరల్ మేనేజర్ (ఐటి) ఎం. మురళీ కృష్ణవర్మ, బ్యాంకు సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎం.ఆదిత్య వర్మ అందుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ, 25 వసంతాలు పూర్తిచేసుకున్న శుభసందర్భంలో తమ బ్యాంకుకు 'బెస్ట్ చైర్ పర్సన్ ఆఫ్ ది ఇయర్', 'బెస్ట్ అర్బన్ కో- ఆపరేటివ్ బ్యాంకు- ఆంధ్రప్రదేశ్ స్టేట్' అవార్డులు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. 25సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మహారాజా స్పెషల్ డిపాజిట్ స్కీమ్ "999 రోజులకు - 9 శాతం వడ్డీ'ని ప్రారంభించినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో మార్చి 31, 2025 నాటికి బ్యాంకు డిపాజిట్లు రూ.290 కోట్లు, రుణాలు - రూ.202 కోట్లుతో మొత్తం వ్యాపారం రూ.492 కోట్లు, నికర విలువ రూ.30.94 కోట్లు కలిగి ఉన్నామని వివరించారు. లాభాలు రూ.4.38 కోట్లు ఆర్జించగా, ఆదాయపు పన్ను రూ.1.14 కోట్లు చెల్లించి రూ.3.24 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించారు. త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరం, రామచంద్రాపురంలో శాఖలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వార్డుల్లో జోనల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59, 60, 61వ వార్డుల్లో జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము శుక్రవారం పర్యటించారు. రోడ్లు అపారిశుధ్యంగా ఉండటంతో సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. ఏ వార్డు కెళ్లినా రోడ్లపై చెత్త ఉంటుందని, ఇంటింటికి వచ్చిన వాహనానికి చెత్త ఇవ్వకుండా రోడ్లమీద వేయటమే అలవాటుగా కనిపిస్తోందని గుర్తించి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక నుంచి అలా జరిగితే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. జివిఎంసి గొల్లలపాలెం హాస్పిటల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ సందర్శించారు. అక్కడ ఉదయాన్నే టిఫిన్ చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ పర్యటనలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వి.సతీష్‌కుమార్, అనిల్, రవి, సునీల్, నవరత్న, గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ పథకం కింద జరుగుతున్న పునరాభివృద్ధి పనులను వాల్తేరు డిఆర్ఎం లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-1 కె.సందీప్ తదితరులు శుక్రవారం పరిశీలించారు. ప్రధాన రైల్వేస్టేషన్ నిర్మాణాన్ని పరిశీలించి, ప్లాటుఫారమ్-1 వద్ద భవన నిర్మాణం, 12 అడుగుల వెడల్పుగల ఫ్లైఓవర్ పనులు, సుందరీకరణ, ప్లాటుపారమ్-4 వైపు ఉన్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. బౌద్ధకొండ ప్రాంతంలో నీటి సరఫరాతో పచ్చదనం పెంపకం, పిఎఫ్ 4 వద్ద లోకాస్ట్ దుకాణాల ఏర్పాటు, రోడ్డు మధ్యలో ఏర్పాటుచేసిన సర్కిల్ సుందరీకరణపై డిఆర్ఎం పలు సూచనలు చేశారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో పర్యటించిన డిఆర్ఎం, డిసిఎమ్-1కు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాషువా, కామేశ్వరరావు వినతి పత్రం అందించారు. విశాఖ- తిరుపతి ఎసి డబుల్ డెక్కర్ ఎక్స్ ప్రెస్‌కు తాత్కాలికంగా లేదా శాశ్వతంగా 2ఎసి, 3ఎసి, 3ఇ కోచ్‌లను చేర్చాలని, దువ్వాడ రైల్వే స్టేషన్లో కోచ్‌లకు నీటి సరఫరా సౌకర్యం, కోచ్ నిర్వహణ సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఐఒసిఎల్ గెడ్డలో పూడికల పరిశీలన

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో హెచ్‌పిసిఎల్ - ఐఒసిఎల్ మధ్య ఉన్న గెడ్డలో పూడికలు పెరిగిపోయి ముంపు సమస్య తలెత్తడంతో జివిఎంసి, హెచ్‌పిసిఎల్, ఐఒసి అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సమస్యపై మూడు సంస్థల అధికారులు చర్చించారు. గెడ్డలో ఉన్న పూడికలు తొలగించి స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తామని జివిఎంసి అధికారులు హెచ్‌పిసిఎల్, ఐఒసి అధికారులు హామీ ఇచ్చారు. త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు.

పారిశుధ్య సిబ్బందికి సబ్బుల పంపిణీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి సచివాలయంలో పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, నూనెలను వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, ఎఎంహెచ్‌ఒ కిరణ్‌కుమార్ శుక్రవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజయరామరాజు, బొట్టా ప్రకాష్, రాజన్‌రాజు, సత్తిబాబు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, భాగ్యలక్ష్మి, ఆదినారాయణ, కల్యాణ్ చక్రవర్తి, సూరష్ పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలి

సమ్మెపై నిర్బంధాన్ని నిలిపివేయాలి

కలెక్టర్‌కు వామపక్ష పార్టీలు, అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు నిలిపివేయాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ, ఎస్‌యుసిఐ, ప్రజాపోరు వామపక్ష పార్టీలతో పాటు విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి సంయుక్తంగా విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించాయి. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలంటే మరో 6 వేల మంది కార్మికుల అవసరం పడుతుందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అన్యాయంగా ఇప్పటికే 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిందని, మరో 2600 మందిని తొలగించడానికి పూనుకుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో కీలక విభాగాల్లో దశాబ్దాల తరబడి పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుల వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తమ ఉపాధిని కాపాడాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టు కార్మికులంతా ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగారన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను స్టీల్‌ప్లాంట్ డిపార్టుమెంట్లలో, బయట నియమించి నిర్బంధాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం, ప్లాంట్ రక్షణ కోసం నిలబడాల్సింది పోయి ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. సమ్మె ఇలాగే కొనసాగితే ప్లాంట్ ఉత్పత్తికి విఘాతం కలిగి నష్టాలకు దారితీస్తుందన్నారు. తక్షణమే యాజమాన్యం, కార్మిక సంఘాలతో కలిసి జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి, కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించి, సమ్మె నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నాయకులు తెలిపిన విషయాలపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి ఎస్.దేవా, ఎస్‌యుసిఐ (కమ్యూనిస్టు) రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, కెఎం.కుమార్ మంగళం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, నాగభూణం, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులు

కొనసాగుతున్న ఉక్కు జెఎసి దీక్షలు

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1505వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ సభ్యులు కూర్చున్నారు. వారినుద్దేశించి సంఘం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడారు. ఉక్కు సమ్మెకు మద్దతు తెలిపారు. సంఘం జిల్లా నాయకులు వి.శ్రీనివాసరావు, దండు నాగేశ్వరరావు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యాన రవీంద్రనగర్ బస్‌స్టాప్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆరిలోవ నాయకులు వి.నరేంద్రకుమార్, నాగరాజు, ఎ.రమణ, వి.భూలోకరావు, వార్యానివాస్ నాయకులు నారాయణమూర్తి, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకట్రావు పాల్గొన్నారు

ములగాడ : స్టీల్‌ప్లాంట్ కాంటాక్టు కార్మికుల సమ్మెకు మద్దతుగా హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన లేబర్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, అధ్యక్షులు కె.పెంటారావు, ఎస్.వాసు, బూడి శ్రీను, గంట దాసు, వి.నీలయ్య, జి.రామకృష్ణ, డి.కిషోర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల తొలగింపును ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వ పోలీసు నిర్బంధం ఆపాలని కోరుతూ సిఐటియు గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యాన పెందుర్తి రైతు బజార్ వద్ద నిరసన తెలిపారు. ఈ సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికల ముందు చెప్పిన కూటమి ప్రభుత్వం ఈ రోజు కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నా నోరు మెదపక పోవడం, పోలీసులను పెట్టి నిర్బంధం ప్రయోగించడం సిగ్గుచేటు అన్నారు. మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి.అనసూయ, యు.రాజు, శంకరరావు, జక్కన సత్యనారాయణ, ప్రభు, ఈశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకులు బి.రమణ తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి రైతు బజార్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు గోపాలపట్నం జోన్ నాయకులు

బదిలీలు, ప్రమోషన్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ, సవరించిన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రకారం ప్రాథమిక పాఠశాలలో 1:20, హైస్కూల్లో 1:49 సెక్షన్ల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి సర్‌ప్లస్ టీచర్ల జాబితాను వెంటనే విడుదల చేయాలని కోరారు. సర్‌ప్లస్ పోస్టులు ఉన్న పాఠశాలలో సీనియారిటీ సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో జూనియర్ టీచర్ ఎవరు అని తెలుసుకోవడానికి మాస్టర్ సీనియారిటీ లిస్ట్‌లను ఎంఇఒ, హెచ్‌ఎంలకు వెంటనే పంపించాలని, వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి ముందుగానే అన్ని కేడర్ల వెకెన్సీ లిస్ట్‌ను ప్రకటించాలని, భాషా పండితులకు బదిలీల్లో తగు న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొమ్మిది రకాల పాఠశాలల్లో జిల్లాలో ఉన్న పాఠశాలలన్నీ ఏయే పాఠశాల కిందకు వస్తాయో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియపరచాలని, ఒక గ్రామంలో పక్క పక్క కాంపౌండ్స్‌లో ఉన్న ఒకటి నుంచి పది తరగతులు ఉన్న హైస్కూళ్లలో ఒకటి, రెండు తరగతులు నిర్వహించే ఫౌండేషన్ పాఠశాలలను విలీనం చేయాలని, స్టడీ లీవ్‌లో ఉంటూ ఎనిమిది సంవత్సరాల సర్వీసు ఒకే స్టేషన్లో పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు ట్రాన్స్‌ఫర్స్‌లో పాల్గొనుటకు అనుమతి ఇవ్వాలని, ట్రాన్స్‌ఫర్స్ అప్లికేషన్లు ఆన్‌లైన్లో పెట్టేటప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రత్యేమైన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అన్ని కేడర్లలో ప్రమోషన్లకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల జాబితాను ముందుగానే విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యలపై డిఇఒ ప్రేమ్‌కుమార్ స్పందిస్తూ ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా నాయకులు గాదిరాజు ఉషారాణి, జిఎస్ ప్రకాష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

60 మందికి నేత్ర వైద్య పరీక్షలు


ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి జెవి.అగ్రహారం సచివాలయంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. మాజీ వైస్ ఎంపిపి పాసి నరసింగరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు సత్య సాయి సేవా సమితి జిల్లా జోనల్ కో-ఆర్డినేటర్ ఎంవి.సత్యసాయికుమార్ తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి భీమిలి కన్వీనర్ ఎం.సూర్యసన్యాసిరావు, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి బి.వివేక్‌వర్మ, క్యాంప్ కో-ఆర్డినేటర్ పైడి రాజు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్యామలాంబ పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులో శ్యామలంబ పండగ చివరి రోజున వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేశారు. పులి వేషాలు, దేవి డాన్సులు, తప్పెటగుళ్లు, సన్నాయిమేళంతో తిరువీధు నిర్వహించారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

టిడిపిలో నాయకత్వ లేమి..

★ వార్థక్యంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు
★ ప్రగడను వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
★ త్వరలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారే అవకాశం ఉందని వదంతులు



పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి

తెలుగుదేశం పార్టీ యలమంచిలి నియోజకవర్గంలో నాయకత్వ లేమిని ఎదుర్కొంటుంది. ఏడాది క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో క్యాడర్ కనబర్చిన తెగువ క్రమంగా సన్నగిల్లుతోందన్న నానుడి వినిపిస్తోంది. నాయకత్వ లోపంతో అది మరింత దిగజారుతోందన్న ఆందోళన ఆ పార్టీ కేడర్‌లో నెలకొంది. కూటమి ప్రభుత్వంలో జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నియోజకవర్గంలో దూసుకుపోతూ తెలుగుదేశాన్ని కలవరపరుస్తున్నా టిడిపి నాయకులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఆ పార్టీ శ్రేణుల నుండే వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ వైసీపీ, తెలుగుదేశం కార్యకర్తలను తన వైపు తిప్పుకుంటూ బలం పెంచుకుంటున్నా టిడిపి నాయకత్వం కళ్లప్పగించి చూస్తోంది తప్పితే రక్షించుకునే ధోరణి కనిపించకపోవడంతో నాయకత్వంపై నిరాశ పెరుగుతోంది. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై తుది నిర్ణయం స్థానిక ఎమ్మెల్యేలదే అని తేలడంతో ఎటూ పాలుపోక తెలుగు తమ్ముళ్ల వెర్రి చూపులు చూస్తున్నారు.

నియోజకవర్గంలో పార్టీ విధి విధానం పట్ల నాయకులు స్పందించక పోవడంతో నాయకత్వంపైనే కార్యకర్తలు అసంతృప్తి ప్రకటిస్తున్నారు. పప్పల చలపతిరావు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో తన వారసుడ్ని తయారు చేసుకోకపోవడం, పోరాట పటిమతో రాజకీయాల్లో రాటుతేలిన ప్రగడ నాగేశ్వరరావుకు ఆరోగ్యం క్షీణించడం పార్టీకి గడ్డు రోజులు తెచ్చిపెట్టాయి. త్వరలోనే నియోజకవర్గ పగ్గాలు కొత్త వారికి అప్పగించే ఆలోచన జరుగుతోందన్న వదంతి కూడా చక్కర్లు కొడుతోంది.

నాయకత్వంలో విభేధాలు

టిడిపి నాయకత్వంలో విబేధాలు కూడా ఆ పార్టీని వెంటాడుతున్నాయి. ఈ కారణంగానే ఈ నెల 20న జరిగిన పార్టీ మినీ మహానాడుకు కొందరు ముఖ్య నాయకులు కూడా హాజరు కాలేదు. ఎంతో కొంత రాంబిల్లి మండలలో బలమున్న వసంతవాడ దిన్‌బాబును టిడిపి మండల అధ్యక్ష పదవి నుండి తప్పించడంతో ఆయన అలక పూని ఏకంగా తనతో పాటు తన అనుచర గణం మినీ మహానాడుకు హాజరు కాలేదు. యలమంచిలి రూరల్ మండల అధ్యక్షులుగా ఉన్న నాయకుడిని ఆ పదవి నుండి తప్పించడంతో ఆయన జనసేన ఎమ్మెల్యేకు జైకొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునగపాక మండలంలో అధ్యక్ష పదవిని కోల్పోయిన నాయకుడు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు మినీ మహానాడును గమనిస్తే అర్థమవుతోంది.

ఎమ్మెల్యేతో సఖ్యతగా...

ఈ తరుణంలో నియోజకవర్గంలో ఇటీవల తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన వారు జనసేనకు చెందిన ఎమ్మెల్యేతో సఖ్యంగా ఉంటూ పనులు, కాంట్రాక్టులు చేసుకునే యోచనలో ఉన్నట్లు సమాచారం. రానున్న నాలుగేళ్ల అభివృద్ధి పనులు జరగాలంటే ఎమ్మెల్యే సహకారం అవసరమన్న సంగతి అవగతం చేసుకొని ఈ నిర్ణయానికొచ్చినట్లు తెలిసింది. టిడిపి మునగపాక మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఎమ్మెల్యే విజయకుమార్‌కు సన్నిహితుడేనన్న సంగతి తెలిసిందే. అచ్యుతాపురం టిడిపి అధ్యక్షుడు పీలా తులసీరాం కూడా ఎమ్మెల్యేతో కలగలిపి వ్యవహరిస్తున్నారు. యలమంచిలి మండల పార్టీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి నాయుడు ఎమ్మెల్యేకు వీరాభిమానిగా పేరొందారు. ఇక రాంబిల్లి మండలానికి వస్తే అధ్యక్ష పదవికి ఎవరినీ ప్రకటించలేదు. జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్ కుమారుడు భరత్‌కు కేటాయించే అవకాశం ఉందని తెలిసింది. ఈ నేపథ్యాన్ని పరశీలిస్తే రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీకి గట్టి నష్టమే జరుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎప్పటిప్పుడు చురుకైన నిర్ణయాలు తీసుకోవడంలో నియోజకవర్గ నాయకత్వం విఫలమైనందువల్లే ఈ దుస్థితి పార్టీకి పట్టిందని కార్యకర్తలు వాపోతున్నారు.


విభిన్న ప్రతిభావంతునికి వాహనం అందిస్తున్న కలెక్టర్

విభిన్న ప్రతిభావంతునికి వాహనం వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అచ్యుతపురం సెజ్‌లో ఉన్న టొయోటా రేర్ ఎర్త్ జపాన్ కంపెనీ వారు సిఎస్ఆర్ నిధులతో త్రిచక్ర హెూండా యాక్టీవ్ వాహనాన్ని వితరణ చేయగా, దానిని శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో రావికమతం మండలం రోచుపణుకు గ్రామానికి చెందిన విభిన్నప్రతిభవంతుడైన లబ్ధిదారుడు తుర్రి రవికి కలెక్టర్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్, కంపెనీ క్వాలిటీ కంట్రోల్ హెడ్ ఆర్ రవి కుమార్ పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -మునగపాక : మండలానికి చెందిన టిడిపి నాయకులు శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడిని నర్సీపట్నంలో ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్‌తో కలిసి పార్టీ శ్రేణులు అయ్యన్నకు పూలమాలలు వేసి శాలువలతో ఘనంగా సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన విజయ్‌ను అయ్యన్న ప్రశంసించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శీను, టిడిపి నాయకులు ఎంవిఆర్ నాయుడు, దాడి శీను, సబ్బి శీను, కాండ్రేగుల శంకర్, పెంటకోట శ్రీరామ్ మూర్తి, దాడి జగన్నాథరావు, దాడి గంగాజి, మల్ల శేషు, ఆడారి కాశీ రావు, ఆడారి బాలాజీ, ఇందలప్రసాద్, దొడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షులు బాబీకి అభినందన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ చేతుల మీదుగా అనకాపల్లి టీడీపీ మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసి నాయుడు (బాబీ)కి శుక్రవారం ఎంపీ కార్యాలయంలో చిరు సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, రమేష్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగదుర్గమాంబ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో నాగదుర్గమాంబ విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఉదయం భక్తిశ్రద్ధలతో జరిగింది. నూతనంగా ఆలయం నిర్మించి ప్రత్యేక పూజలు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగలి మహేష్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, చుక్క రమణ, వాకాడ చిన్న, చల్లా సత్యం, బండారు సింహాద్రప్పుడు, వాకాడ దేముళ్ళు, పైల స్వామి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : మండలం తాళ్ళపాలెం గ్రామ టిడిపి అధ్యక్షులు, ఎన్‌టిఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఉల్లింగల రమేష్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం జరిగాయి. రాష్ట్ర ఇన్ఫర్మేషన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కేక్ కట్ చేసి రమేష్‌కు తినిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గోంతిని శ్రీనివాసరావు, సిదిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి గంగయ్య, తిర్రి చిరంజీవి, బుదిరెడ్డి అప్పడు పాల్గొన్నారు.


రమేష్‌కు కేక్ తినిపిస్తున్న పీలా గోవింద


వాటర్ ట్యాంకర్, చెత్త తరలించే ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వాటర్ ట్యాంకర్, చెత్త సేకరణ ట్రాక్టర్లు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : రావాడ మేజర్ పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్‌ను, ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే ట్రాక్టర్లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, కన్నూరు దేవి వెంకటరమణ, గొన్న రమాదేవి, వర్రి పరదేశి, చిన్నారావు, బోండ తాతారావు, వెన్నెల నరసింహారావు, పిల్లా శివకృష్ణ, సుందరపు శ్రీనివాసరావు, బల్రెడ్డి సతీష్ పాల్గొన్నారు.

నేడు యోగాపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న శనివారం విద్యార్థులకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గస్తీలు ముమ్మరం చేయాలి

- డయల్ 112 కాల్స్‌కు వేగవంత స్పందనతో బాధితులకు సహాయం అందించాలి

- జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా



సమావేశంలో పాల్గొన్న ఎస్‌పి, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : గస్తీలు ముమ్మరం చేయాలని, విజిబుల్ పోలీసింగ్ విస్తృతం చేయాలని, అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ డివైస్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధ్యక్షతన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు కీలక అంశాలపై సమీక్ష చేశారు. పాత పెండింగ్ కేసులు, ఎన్.డి.పి.ఎస్ కేసులు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, సాధారణ మరణాలు, ఎన్ఫోర్స్మెంట్ కేసులపై పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారుల నుండి సమగ్ర సమాచారం తీసుకొని, కేసుల త్వరిత ఛేదనకు కావలసిన సూచనలు అందించారు. డయల్ 112 కాల్స్‌కు త్వరిత స్పందన ఉండేలా శిక్షణతో కూడిన టీమ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు భరోసా కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా పాల్పడుతున్న స్మగ్లర్ల ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో యాక్ట్, మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఫోర్స్మెంట్‌లో ప్రతిభ కనబర్చిన అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి.ఎస్.ఎన్.వి.ప్రసాదరావు, కె.జగదీశ్వరరావు, తదితరులకు ప్రశంసలు అందించారు. అనకాపల్లి టౌన్ సిఐ టివి.విజయ్ కుమార్ "బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది మంత్"గా ఎంపికయ్యారు. మొత్తం 56 మంది పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, డీఎస్పీలు బి.మోహనరావు, పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-పరవాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. పరవాడ, పెదగంట్యాడ, జీవీఎంసీపరిధిలోని గ్రామాల నుండి పలు సమస్యలపై 105 అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఇందులో ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, వంటరి మహిళలకు పింఛను, రేషన్ కార్డులు, విద్యుత్ సమస్యలు, ల్యాండ్ పూల్లింగ్‌లో పట్టాల విషయమై, రామ్‌కి ఫార్మాసిటీ కాలుష్యం తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. రాంకీ ఫార్మా కాలుష్యంపై తగు చర్యలు తీసుకొని ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిసెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. రావాడ పంచాయతీలో గొల్లగుంట గ్రామ ముస్లిం మైనార్టీ ప్రజలకు చెందిన స్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, డిటి సురేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, టిడిపి నేత కన్నూరు వెంకటరమణ, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రేషన్ డీలర్లు

పరవాడ : పరవాడ మండలంలోని రేషన్ డీలర్లు పరవాడ ఎంపీడీవో ఆఫీస్‌లో ప్రజా దర్బార్ కార్యక్రమానికి శుక్రవారం వచ్చిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎండియు వ్యవస్థను రద్దు చేయడంపై ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ కట్టమూరి రాజు, సెక్రెటరీ సమ్మంగి సోమేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ నర్సింగరావు, జి చందర్రావు, బి రాజ్‌కుమార్, కె రవణమ్మ, సీనియర్ డీలర్లు పాల్గొన్నారు.

రైవాడ ప్రాజెక్టుకు పొంచివున్న ప్రమాదం

-నిధులు కేటాయించి ఆధునికీకరించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

రైవాడ ప్రాజెక్టుకు ప్రమాదం పొంచిఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పేర్కొన్నారు. రైవాడ రిజర్వాయర్ గేట్లను శుక్రవారం ఆయన పరిశీంచారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైవాడ ప్రాజెక్ట నిర్మాణం జరిగి ఐదు దశాబ్దాల కావస్తుందని, గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, స్పీల్వే స్పియర్లు బీటలు వారాయని తెలిపారు. దీని ప్రమాదాన్ని ఇరిగేషన్ అధికారులు గుర్తించి నిపుణులకు చూపించి పునర్నిర్మాణానికి ప్రతిపాదనులు కూడా పంపించారని పేర్కొన్నారు. రూ.336 కోట్లు ప్రపంచబ్యాంకు నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వ ప్రకటించినా ఆచరణలో అతీగతి లేదన్నారు. యలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్చుతాపురం, కె.కోటపాడు, దేవరాపల్లి, చోడవరం మండలాల్లో వేలాది ఎకరాల సాగునీరు, గ్రేటర్ విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లాలోనే అత్యంత కీలకమైన ప్రాజెక్టుపై పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. వచ్చే వర్షాకాలంలో వరద నీరు వచ్చి చేరితే గేట్లుకు ప్రమాదం ఏర్పడితే శారదా నది పరివాహక ప్రాంతం మొత్తం ముంపునకు గురై తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రైవాడ ప్రాజెక్టు ఆదునికీకరణ చేపట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు.



శిథిలావస్థలో ఉన్న రైవాడ ప్రాజెక్టు గేట్లును పరిశీలిస్తున్న వెంకన్న

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మొగలిపురం గ్రామ సర్పంచ్ గండి అరుణ అన్నారు. మండలంలోని మొగలిపురం గ్రామ సచివాలయంలో ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులు గండి శ్రీరాములు, సిరపరపు సత్యవతిలను అభినందించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, సిరపరపు రాంబాబు, గండి నరేష్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక రాజీవ్ గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రభుత్వ ఉత్తర్వులు 160, 729 ప్రకారం కశింకోట, అనకాపల్లి, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన వినియోగదారుల పిల్లలు, సంస్థ ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన 50 శాతం సీట్లలో అడ్మిషన్ కొరకు దరఖాస్తుల ప్రక్రియ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాలిసెట్ కౌన్సిలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించిన అనంతరం, పూరించిన దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని విద్యార్థులకు సూచించారు. ఆసక్తి గలవారు కళాశాల పని వేళలో దరఖాస్తులను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.ఉమా శంకర్, అసోసియేట్ ప్రిన్సిపల్ కర్రి శివ, విభాగాధిపతి గణేష్, పాల్గొన్నారు.

గ్రావెల్, ఇసుక అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, ఇసుక అక్రమ మైనింగ్ ద్వారా తరలిపోతుందని, దానిని అరికట్టాలని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జనసేన పార్టీ నాయకులతోకలిసి ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామఅప్పారావు, గూనూరు మూలునాయుడు, సిరిపురం రమేష్, తుమ్మపాల రమేష్, కర్రి రమేష్ పాల్గొన్నారు.

టిడిపి మహానాడును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : టిడిపి మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. శుక్రవారం బుచెయ్యపేటలో మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, కోరుకొండ రవికుమార్, తమరాన దాసు, ఎంవివి సత్యనారాయణ, సాయం శేషు, డోంకిన అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్ : టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద్ టీడీపీ శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రి బాబీ, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, జోగి నాయుడు, పోలారపు త్రినాధ్, నంభారీ శ్రీనివాసరావు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, తలారి కాశీ నాయుడు, రాపేటి రామ్ కుమార్, ఎంపీటీసీ అప్పడు, ఉల్లింగల రమేష్, గంగయ్య, రమణ, నూకరాజు పాల్గొన్నారు.

పెతకంశెట్టికి ఘన నివాళి

ప్రజాశక్తి-మునగపాక : మాజీ ఎంపీ కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పలనరసింహం 18వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని నాగులాపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు పెతకం శెట్టి అప్పల నరసింహం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు వెంకటభాస్కరరావు, పెతకంశెట్టి రాజునాయుడు, హైస్కూల్ కమిటీ చైర్మన్ పొలమరశెట్టి సూకాలయ్య, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శ్రీను, వేగి సోమేశ్వరరావు, మళ్ల కాళేశ్వరరావు, శరగడం సత్యనారాయణ, మోరా రమేష్, మళ్ల బాపునాయుడు, మళ్ల సుధాకర్, మూర్తి, వేణు, శివాజీ, కుమార్, శ్రీను పాల్గొన్నారు.

అధ్వాన రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో అధ్వానంగా రోడ్లకు మరమ్మతులు చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు వియ్యపు రాజు డిమాండ్ చేశారు. అనకాపల్లి-చోడవరం రోడ్డు, నర్సీపట్నం-రావికమతం, అచ్చుతాపురం, మాడుగుల ఇలా జిల్లాలో మొత్తం రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. రోడ్లు మరమ్మతు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.

భూమి ఒకరిది.. ఆన్‌లైన్‌లో పేర్లు వేరొకరివి

తమకు న్యాయం చేయాలని తహశీల్దారుకు బాధితులు వినతి



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

గత ప్రభుత్వ హయాంలో జగనన్న భూ రీ సర్వేలో జరిగిన తప్పిదాలు, అక్రమాలు బయటకొస్తున్నాయి. మండలంలోని పెదమదిన గ్రామంలో జిరాయితీ భూమిని యజమానుల ప్రమేయం లేకుండానే రీసర్వేలో ఇద్దరు వ్యక్తులు పేరిట రెవెన్యూ అధికారులు వెబ్ ల్యాండ్‌లో మార్చేశారు. దీనిపై సంబంధిత బాధితులు నక్కా కొండమ్మ, నక్కా సింహాచలం గురువారం తహశీల్దార్ ఎం.లక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. తిరిగి తమ భూమిని ఆన్‌లైన్‌లో తమ పేరుతో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... పెదమదిన రెవిన్యూలో 200-4సర్వేనెంబర్‌లో 84 సెంట్ల భూమి నక్కా సింహాచలం అనే వ్యక్తికి ఉండేది. ఇతనికి ఈశ్వరరావు, రాంబాబు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ఈశ్వరరావు మరణించగా రాంబాబు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. రాంబాబు కుమారుడు సింహాచలం, ఈశ్వరరావు భార్య కొండమ్మ సంబంధిత భూమిని పెదమదినకు చెందిన నమ్మి శ్రీను, అనకాపల్లి మండలానికి చెందిన బొట్టా శ్రీనుకి రూ.14లక్షలకు అమ్మకానికి కొంత అడ్వాన్స్ తీసుకొని 2019లో అగ్రిమెంట్ రాశారు. మిగిలిన సొమ్ము చెల్లించిన తరువాత రిజిస్ట్రేషన్ చేయించుకొని భూమిని స్వాధీనపర్చుకోవాలని అగ్నిమెంట్ రాసుకున్నారు. అయితే అగ్రిమెంట్ రాసిన నమ్మి శ్రీను, బొట్టా శ్రీను భూ యజమానులకు మిగిలిన డబ్బులు ఇవ్వకుండానే 2023లో జగనన్న సమగ్ర భూ సర్వే సమయంలో స్థానిక రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై రీసర్వేలో తమ పేరిట ఆ భూమిని రాయించుకొని ఆన్‌లైన్ చేయించుకున్నారు. తమకు తెలియకుండానే తమ భూమిని వారి పేరున రాయించుకున్నారని, కనీసం తమకు రావలసిన డబ్బులు కూడా ఇవ్వడం లేదని బాధితులు నక్కా కొండమ్మ, నక్కా సింహాచలం తహశీల్దారు ఎదుట కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ భూమే తమ జీవనాధారమని, తమ భూమి తమ పేరున ఆన్‌లైన్ చేయాలని, లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. అక్రమంగా ఆన్‌లైన్ చేసిన భూమిని తమ పేరున ఆన్‌లైన్ చేస్తే తరువాత తమకు చెల్లించాల్సిన డబ్బులు ఇచ్చిన తరువాత తాము రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఈ విషయంలో ఇక్కడ న్యాయం జరగకపోతే అమరావతిలో సిఎం చంద్రబాబును కలిస్తామని బాధితులు తెలిపారు.

ఎండియు వ్యవస్థ రద్దు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న యం.డి.యు వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సరుకుల సరఫరాలో లోపాలుంటే సరిదిద్దాలి తప్ప ప్రజలకు సేవలందిస్తున్న వ్యవస్థను రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎండియు సేవలు నిలిచిపోవడంతో ఐదేళ్లుగా ఎండియు వ్యవస్థపై ఆధారపడి బతుకుతున్న ఆపరేటర్లు, హమాలీల ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. సరుకుల సరఫరాను మెరుగుపర్చేలా ఎండియు వ్యవస్థను తీర్చిదిద్దాలని కోరారు. బియ్యంతోపాటు కందిపప్పు, నూనె, చింతపండు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎండియు ఆపరేటర్ల జీవితాలతో చెలగాటం

అనకాపల్లి : ప్రజా పంపిణీ వ్యవస్థలో దేశం మెచ్చిన రేషన్ డోర్ డెలివరీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వైయస్సార్సీపి అనకాపల్లి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎండియూ వాహనాల వ్యవస్థను రద్దుచేసి సుమారు 20వేల కుటుంబాలను ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే వైసీపీ తరపున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం పర్యవేక్షించారు. దేవాదాయ శాఖ అధికారులతో సుదీర్ఘంగా 4 గంటలు సమీక్ష సమావేశం నిర్వహించి దేవాలయంలో జరుగుతున్న, జరగబోవు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. వాటికి కావలసిన నిధులు, ఇప్పటి వరకు ఖర్చుపెట్టినటువంటి ఖర్చుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన మిగిలి ఉన్న దేవాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయంలో వేస్తున్న గ్రానైట్ ఫినిషింగ్ టైల్స్‌ను వాడకూడదని దీనిని మార్చిరఫ్ గ్రానైట్, నేచరల్ స్టోన్ ఫ్లోరింగ్ వేయమని ఆదేశించారు. ఆలయ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దాలని, దేవాలయంలో ఏసీలు, విద్యుత్ దీపాలు విరివిగా ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం కావలసిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వి.రాంబాబు, దేవాదాయ శాఖ డీఈఈ కృష్ణ, ఉపసపతి శ్రీనివాసాచార్యులు, ఏఈ శివప్రసాద్, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ధర్మకర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్,మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, పాల్గొన్నారు.

ఉత్సాహంగా కోలాటం పోటీలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం శివారు గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పరవాడ కోలాట బృందానికి రూ.10వేలు, ద్వితీయ బహుమతి శ్రీరామ్‌పట్నం కోలాట బృందానికి రూ.8 వేలు, తృతీయ బహుమతి లక్కవరం బృందానికి రూ.6వేలు, నాలుగో బహుమతి అంకుపాలెం టీమ్‌కు రూ.4వేలు, ఐదో బహుమతి మొగలిపురం బృందానికి రూ.2 వేలు, ఆరో బహుమతి చిరికివానిపాలెం జట్టుకు వెయ్యి రూపాయలు, మొగలిపురం -2 జట్లుకు వెయ్యి రూపాయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మామిడి ధరలు తగ్గడంతో రైతు కుదేలు

నష్టాలు మిగిల్చిన ఈదురుగాలులు



విక్రయానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మామిడి పండ్ల ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. వేసవికాలంలో ఎండలు కాయాల్సి ఉండగా తరచూ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో మామిడికాయలు నేలకు రాలిపోతున్నాయి. దీంతో మార్కెట్లో మామిడి పళ్ళు డిమాండ్ కంటే ఎక్కువ రావడంతో ధరలు తగ్గిపోయాయి. మూడు కిలోల బంగినపల్లి, సువర్ణరేఖ వంటి మంచి రకాల పండ్లు కేవలం రూ.100కే లభ్యమవుతున్నాయి. గత ఏడాది ఒక కేటు మామిడి పండ్ల ధర రూ.2000 ఉంటే ఈ ఏడాది కేవలం రూ.1000లోపే ధర పలుకుతోంది. దీంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని కె.సంతపాలెం గ్రామంలోని రైతు బజార్లో మామిడి రైతులు వ్యాపారులు నిర్ణయించిన తక్కువ ధరలకే అమ్ముకొని నిరాశగా వెనుతిరుగుతున్నారు.

నేడు 20 సూత్రాల కార్యక్రమం అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలవుతున్న తీరుపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చైర్మన్ లంక దినకర్ సమీక్షించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ఉపాధి హామీ, జల జీవన్ మిషన్, పీఎం గ్రామీణ సడక్ యోజన, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, అమృత్ 1.0, 2.0, లాఖ్ పతి దీదీస్, ఎస్‌హెచ్‌జీలకు డ్రోన్స్, విశ్వకర్మ, పీఎం స్వనిధి, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్ తదితర పథకాల అమలు తీరును సంబంధిత అధికారులతో చైర్మన్ సమీక్షించనున్నట్లు చెప్పారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పిఎం ఫసల్ బీమా యోజన, పిఎం కృషి సంచాయ్ యోజన, ఎరువుల సబ్సిడీ, జాతీయ గోకుల్ మిషన్, పాల ఉత్పాదకత, ప్రస్తుత స్థితిగతులపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులందరూ పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

పండ్ల దుకాణాల్లో తనిఖీలు



పండ్ల దుకాణాల వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- మాడుగుల : మాడుగుల మండల కేంద్రంలో పండ్ల దుకాణాలపై శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పెషల్ డ్రైవ్ దాడులు నిర్వహించారు. మామిడి, అరటి వంటి వివిధ రకాల పండ్లను కాల్షియం కార్బోహైడ్రైడ్ వంటి రసాయనాలు కొట్టి పండిస్తున్నారని, దీని వల్ల కేన్సర్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున. స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలో అన్నిమండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అనకాపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని ఎన్ శ్రీజ తెలిపారు. మాడుగులలో మామిడి, అరటి ఇతర పండ్ల శాంపిళ్లను సేకరించి, విశ్లేషణకు పంపుతున్నామని, వచ్చిన నివేదికల ఆధారంగా వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనం

ప్రజాశక్తి- నక్కపల్లి : రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు.. శుక్రవారం నక్కపల్లి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు 50 శాతం రాయితీపై పచ్చి రొట్టె విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేలకు తగినంత సేంద్రియ సారాన్ని అందించుటకు పచ్చి రొట్ట వాడకం ఎంతో మేలన్నారు.ఖరీఫ్ ప్రధాన సీజన్‌కు ముందుగా జీలుగా, జనుమ, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట విత్తనాలను వేసుకుని, అవి పూత దశకు వచ్చే సమయంలో నేలలో కలియదున్ని ఊరబెడితే, సేంద్రియఎరువుగా మారుతుందని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుభూమిలో పోషకాల్ని అందుబాటులోకి తీసుకువచ్చి భూసారాన్ని కాపాడుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గడం వల్ల రైతుకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజులుగా విద్యుత్‌కు అంతరాయం

▸▸ విరిగిపడిన కరెంట్ స్తంభం ▸▸ పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



విరిగిపడిన కరెంట్ స్తంభం

ప్రజాశక్తి- మాడుగుల : ఈదురు గాలులు, భారీ వర్షానికి వారం రోజుల కిందట సత్యవరం ఫీడర్ నుంచి జంపెనకు చెందిన కోన వారి కల్లాలు వద్ద ప్రభుత్వ మోటార్లకు వెళ్లే లైన్‌లోని మూడు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి వారం రోజులు గడిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో మోటార్లు పనిచేయక పశువులకు నీరు పెట్టడానికి ఇబ్బందులు పడుతున్నామనిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాకుండా, ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. సత్వరమే విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, సమస్య పరిష్కరించాలనికోరుతున్నారు. దీనిపై విద్యుత్ లైన్‌మ్యాన్ బుజ్జిని వివరణ కోరగా తాను విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే సరిచేస్తాను గానీ స్తంభాలను తీసుకురాలేనని సమాధానం ఇచ్చారు. ఎఇఇకి లెటర్ రాసి పెడితే వస్తే చేస్తానని అంటున్నాడు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

జాతీయస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన \ వికలాంగ విద్యార్థులకు అభినందన



వికలాంగ క్రీడాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి - రావికమతం: మండలం నుంచి జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన మానసిక వికలాంగ విద్యార్థులను చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఘనంగా సత్కరించారు. శుక్రవారం మండలంలో గర్నికం తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వికలాంగ విద్యార్థులను ప్రత్యేక ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన అడిములము సూర్య గోపీనాథ్ వితరణగా అందజేసిన రూ.నాలుగు వేల విలువ చేసే స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ రావికమతం మండలం నుండి జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ క్రీడాపోటీలకు అప్పికొండ గణేష్ జాతీయస్థాయి వికలాంగుల యూనిఫైడ్ వాలీబాల్ పోటీలకు, నక్కరాజు బాల సరస్వతి జాతీయస్థాయి బోసి గేమ్‌లకు ఎంపిక కావడం గర్వకారణమన్నారుఉ. వైకల్యమున్నప్పటికీ వాటన్నింటినీ అధిగమించి, పట్టుదల, ఆత్మస్థైర్యంతో తమను తాము నిరూపించుకుని జాతీయపోటీలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, జాతీయపోటీల్లోనూ రాణించి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. వికలాంగ బాలలను అద్భుతంగా తీర్చిదిద్దిన ప్రత్యేక ఉపాధ్యాయులను అభినందించారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాజాన కొండనాయుడు, చిన్నపాచిల సర్పంచ్ కోమటి శంకర్రావు, రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, గంజి సూర్యానారాయణ, మేడివాడ సర్పంచి వజ్రపు శివ, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథ నాయుడు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సాయం చెక్కులను పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నియోజకవర్గంలోని ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచిమంజూరైన రూ. 5,12,345 ఆర్థికసాయం చెక్కుల స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం పంపిణీ చేశారు. నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ, . అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తోందన్నారు. గత పది నెలల్లో నియోజకవర్గంలోని 25 మందికి పైగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం టిడిపి కౌన్సిలర్ రాజుల నాయుడు, గోవిందు, నాతవరం మండల టిడిపి అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు

యోగాలో భాగస్వాములు కావాలి



నక్కపల్లిలో నిర్వహిస్తున్న యోగా అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- నక్కపల్లి: యోగాంధ్రలో ప్రజలను భాగస్వాములు కావాలని ఎంపిడిఓ డి. సీతారామరాజు, తహశీల్దార్ నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. వచ్చేనెల 21న అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని, యోగా మాసోత్సవాలపై శుక్రవారం నక్కపల్లిలో అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విశాఖ కేంద్రంగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. యోగా ప్రోటోకాల్ ప్రకారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు.దీనికి సంబంధించి మండలంలో విస్తృతంగా యోగా శిక్షణా కార్యక్రమాలు, అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో. వేంపాడు ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కె.రఘు. గొడిచెర్ల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి సంధ్య, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎపిఎం శ్రీనివాస్,ఎపిఒ భాగ్యలత, యోగా శిక్షకులు దవరసింగి రాంబాబు, డిఎస్‌వి సాయి. నరసమ్మ, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రావికమతం: యోగాంధ్ర కార్యక్రమంలో గ్రామ, వార్డు, మండల స్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఎంపిడిఒ వెంకన్న బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో యోగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వెంకన్న బాబు మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాలలో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. వచ్చేనెల 21న విశాఖ ఆర్కే బీచ్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నారావు, ఇసి, టిఎలు పాల్గొన్నారు.

ఆనందపురం : మండల పరిధి శొంఠ్యాంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో ఎన్ఎస్ఎస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన శుక్రవారం నేషనల్ యోగా డే ఇనీషియేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఢిల్లేశ్వరరావు యోగా చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ మాట్లాడుతూ, యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో ఒక భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ డాక్టర్ పిఎస్.రాజు, ఎన్ఎస్ఎస్ పిఒ పి.హరగోపాల్, పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల హర్షాతిరేకాలు



రవిచంద్రను సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

ప్రజాశక్తి-నక్కపల్లి : రేషన్ డిపోలను తిరిగి తమకు అప్పగించడం పట్ల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నక్కపల్లిలో అభినందన సభ నిర్వహించి, ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్, ఎంపీ సీఎం రమేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు నల్లల్ల ఈశ్వరరావు, కొప్పిశెట్టి హరిబాబు, పెదకాపు, దొరబాబు, పిక్కి గంగరాజు, సందీప్ కుమార్, మణిదీప్, వెంకటలక్ష్మి, అప్పయ్యమ్మ, నాగమణి, మాధవ, కష్ణ, దేవుడు, గణేష్, రమణ, తాతారావు, పాపారావు, ప్రసాద్, సత్యనారాయణపాల్గొన్నారు.

మాడుగుల : పాత పద్ధతిలోనే రేషన్ డిపోలను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణను కలిసి, తమ హర్షం వ్యక్తం చేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు చింత వెంకటనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు వీర్ని సురేష్, కార్యదర్శి పెంటకోట జగన్నాథరావు, కోశాధికారి పుట్ట ప్రకాష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ఎండియు వాహనాలు రద్దు చేసి, రేషన్‌డిపోలను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయించడంపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గొలుగొండ డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు దళ్ళే కొండబాబు, మండల సెక్రెటరీ ఎం.స్వామినాయుడు ఆధ్వర్యంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్రను కలిసి సన్మానించారు. సిఎం, డిప్యూటీ సిఎం, పౌరసరఫరాల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేనమండల అధ్యక్షులు గండం దొరబాబు జిల్లా సెక్రెటరీ అల్లాడు సురేష్ నాయకులు పాల్గొన్నారు

రావికమతం : ఐదేళ్లలో రేషన్ డీలర్లు పడిన ఇబ్బందులను గుర్తించి, పూర్వం మాదిరిగానే డిపోలను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయించడంపై మండల డీలర్ల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజును కలిసి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే రాజును సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్ల సంఘ కార్యదర్శి నూకాలతల్లి, ట్రెజరర్ రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులు దేవుడు, నాగ సత్యవతి, గిరిబాబు, శ్రీదేవి, మారాజు, రాజు, దేవి పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 17 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 17 వినతులు వచ్చాయని జివిఎంసి సిటీ ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జివిఎంసి పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 26 రోజులుగా సమ్మె చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎన్.ఎస్ ప్రజ్ఞ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలన్నారు. 26 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి తమ రోదన వినిపించకపోవడం బాధాకరం అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాల పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరిం చాలన్నారు. ఇపిఎఫ్ పునరుద్ధరిం చాలన్నారు. పిఎఫ్ కటింగ్ రెండు సంవత్సరాలుగా నిలిపివేయడం సరికాదని, పాతపద్ధతిలో పిఎఫ్ కట్ చేయాలని డిమాండ్ చేశారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కార్యదర్శి గంట సుధ, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు భూసమస్య పరిష్కారం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి రెవెన్యూ పరిధిలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యను తహశీల్దారు తిరుమలబాబు చొరవతో సర్పంచ్ అప్పారావు, ఎంపిటిసి సూర్యప్రకాష్, ఇతర గ్రామ పెద్దల సమక్షంలో శుక్రవారం పరిష్కరించారు.

వివరాల్లోకి వెళితే ఎర్ర సింహాచలం, నాగరాజు, అప్పారావు, ముగ్గురు అన్నదమ్ములు. వీరికి గ్రామంలో వీరికి 371/1, 294/3, 366, 371, 367/8బి సర్వేనెంబర్లలో 10.45 ఎకరాల వారసత్వ భూమి ఉంది. అయితే వాటాల పంపకంలో తలెత్తిన వివాదంతో నాలుగైదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎట్టకేలకు తాహసిల్దార్ తిరుమలబాబు చొరవ తీసుకుని సర్వే సిబ్బందికి ఆదేశించగా, వారు సమగ్ర విచారణ చేపట్టారు, ముగ్గురు అన్నదమ్ముల సమక్షంలో ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

దళితులపై దాడికి పాల్పడ్డవారిని

తక్షణమే అరెస్టు చేయాలి

- నక్కపల్లిలో దళిత సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ
- తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన, వినతిపత్రం అందజేత


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత దళితులతో పలు సంఘాల నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని డొంకాడలో దళితులపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాలు, నాసా సంస్థ, వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. దళితులపై దాడి జరిగి ఆరు రోజులు అవుతున్నా నేటికీ బాధ్యులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం నక్కపల్లిలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. కో ఆపరేటివ్ బ్యాంక్ నుండి జాతీయ రహదారి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. తహసిల్దార్ నరసింహామూర్తికి వినతి పత్రం అందజేశారు

ఈ సందర్భంగా .దళిత సంఘాలు నాయకులు మాట్లాడుతూ డొంకాడ దళితులపై దాడి ఘటనలో నర్సీపట్నం డిఎస్‌పి విచారణ జరిపి మూడు రోజులు అవుతున్నా, బాధ్యులను పోలీసులు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని కోరారు. బాధిత, దళితులకు పనులు కల్పించాలని, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

దీనిపై తహసిల్దార్ స్పందిస్తూ, దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి, దళితులకు న్యాయం చేస్తామని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో శాంతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

అంతకు ముందు ఎస్ఐ సన్ని బాబును కలిసారు.దళితులపై దాడి ఘటనలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయకుండా నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్‌లో ప్రస్తుతం నమోదుచేసిన సెక్షన్లు మార్పుచేసి, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లతో వెంటనే అరెస్ట్‌లు చేయాలన్నారు. కార్యక్రమంలో బి.కల్యాణరావు, ప్రభాకరరావు, సోనీవుడ్, జి..కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, రామునాయుడు, సుబ్బన్న, చిరంజీవి, శ్రీను, ఏసు, చిన్న, రాజేష్, కన్నబాబు, అప్పారావు, శివ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- మాడుగుల : పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మాడుగులలో దుర్గాలమ్మ ఆలయ సమీపంలో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి ఆసుపత్రి,ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు వివిధ పనుల నిమిత్తమై వచ్చే పేదవారికి అనుకూలంగా ఉదయం, టిఫిన్ నుంచి రెండు పూటలా భోజనం రూ.ఐదుకే అందించే విధంగా నియోజకవర్గ కేంద్రమైన మాడుగులలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.65 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. స్థానికంగా వివిధ షాపుల్లో పనిచేసే కార్మికులు,శ్రామికులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అన్నాక్యాంటీన్ భవనం పూర్తవడానికి ఆరు నెలల కాలం పడుతుందని కాంట్రాక్టర్లు చెప్పినప్పటికీ, మూడు నెలల్లో పూర్తి చేసి, అందరికీ భోజన సదుపాయం కల్పించే చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, ఎంపీపీ రాజారాం, సర్పంచ్ ఎడ్ల కళావతి, తహసిల్దార్ కే. రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, పంచాయతీ కార్యదర్శి కె మూర్తి బాబు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

నేడు గొందేశి ప్రభాకరరెడ్డి సంతాపసభ


గొందేశి ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో ఇఎస్అండ్ఎఫ్ విభాగంలో జనరల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహించి ఇటీవల మృతి చెందిన స్టీల్ ఐఎన్‌టియుసి ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి సంతాప సభను నగరంలోని పెద్ద కోరాడలో ఈనెల 24న శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించ నున్నారు. కుటుంబసభ్యులు, తోటి స్టీల్ కార్మికులు, ఉద్యోగుల సమక్షంలో నిర్వహించే సంతాప సభకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజు, 14 నిర్వాసిత గ్రామాల ప్రజల హాజరుకానున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.